క్లుప్తంగా

రాణించిన చింతలపేట విద్యార్థులు



త్రోఫీతో జిల్లా త్రోబాల్ క్రీడాకారులు

గుర్ల: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో చింతలపేట హైస్కూల్ విద్యార్థులు రాణించ డంతో విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించిందని చింతలపేట హైస్కూల్ పీఈటీ కె.లక్ష్మణ్ తెలిపారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఏపీ త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి సులోచన చేతులు మీదుగా జిల్లా జట్టు ట్రోఫీ అందుకుంది. విద్యార్థులను జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జనరల్ సెక్రటరీ లక్ష్మణ్ అభినందించారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. వేకువ జామున 4 గంటలకు అభిషేకాలు ప్రారంభిం చారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. పలువురు భక్తులు ప్రభలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ దాతల సహకారంతో అన్నదానం చేశారు.


స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



స్నేహితుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

జామి: మండలంలోని అలమండ ఉన్నతపాఠశాలలో 1977–78 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదు వుకున్న కొంట్యాడ గ్రామానికి చెందిన కొమ్ము ప్రసాద్ అనే వ్యక్తి ఇటీవలె గుండెపోటుతో మరణించారు. ఆయనతో కలిసి పదోతరగతి చదువుకున్న స్నేహితులకు ఈ విషయం తెలియడంతో మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలని భావించారు.పూర్వవిద్యార్థులంతా కలిసి రూ.28,000 నగదును మృతుడు ప్రసాద్ భార్యకు ఆదివారం అందజేశారు. జి.శ్రీను, కె.హేమంత్‌కుమార్, పాటేల శ్రీను, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గజపతినగరం: స్థానిక వినాయక కోవెల వీధిలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు.గజపతినగరంతో పాటు ఎం.వెంకటాపురం, దావాలపేట, బూడిపేట, శ్రీరంగరాజపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు హాజరై, స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

అలమండలో నేత్రవైద్య శిబిరం



నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ శాంతి

జామి: మండలంలోని అలమండ బాపూ విద్యానికేతన్ స్కూల్ వద్ద ఆ స్కూల్ కరస్పాండెంట్ లగుడు రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ శాంతి 50 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వారిలో 25 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని ఆపరేషన్ నిమిత్తం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించినట్లు శిబిరం సమన్వయ కర్త ఎస్.జగ్గారావు తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి

- యథేచ్ఛగా రైస్ మిల్లులకు రేషన్ బియ్యం
- డీలర్ల నుంచే తరలిపోతున్న అనుమానాలు
- బ్లాక్ మార్కెట్‌లో కిలో రేషన్ బియ్యం రూ.20
- నియోజకవర్గంలో ఇటీవల 45 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత
- పౌరసరఫరాలశాఖ పర్యవేక్షణ కొరవడడమే కారణమా..?

నియోజకవర్గంలో మండలాల వారీగా రేషన్ డిపోలు, రేషన్ కార్డుల వివరాలు....

మండలం	రేషన్ డిపోలు	రేషన్‌కార్డులు
చీపురుపల్లి	43	18,223
గరివిడి	46	21,100
మెరకముడిదాం	44	18,200
గుర్ల	45	20,560



2024 సెప్టెంబర్ 20న గరివిడిలో పట్టుబడిన 6,724 కిలోల బియ్యంను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన అధికారులు(ఫైల్)

చీపురుపల్లి: చౌక దుకాణాల ద్వారా పేదలకు కిలో రూ.2కే అందాల్సిన బియ్యం పక్కదారి పడుతోంది. పౌరసరఫరాలశాఖ నుంచి చౌకదుకాణాలకు చేరుతున్న బియ్యం అక్కడి నుంచి లబ్ధిదారులకు చేరకుండా తిరిగి బ్లాక్‌మార్కెట్ ద్వారా రైస్ మిల్లులకు చేరుతోంది. 'దొరికితే దొంగ.. లేకుంటే దొర' అన్న చందంగా ఇక్కడ బ్లాక్‌మార్కెట్ పరిస్థితి తయారయ్యింది. అక్కడక్కడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించే దాడుల్లో పట్టుబడిన వారు బయటకొస్తున్నప్పటికీ ఇంకా చాలా వరకు పబ్లిక్ బియ్యం పక్కదోవ పడుతోందనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా కూటమి ప్రభు త్వం ఏర్పడిన తర్వాత రేషన్ బియ్యం యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌లోకి పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ మూ డు నెలల్లో నియోజకవర్గంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నేతృత్వంలో పౌరసరఫరాలశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 45.30 టన్నుల బియ్యమే ఇందుకు ఉదాహరణ. 2024 ఆగస్టు 9న చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామంలో 690 కిలోల బియ్యం, 2024 సెప్టెంబర్ 12న మెరకముడిదాం మండలంలోని గర్భాం పరిసర ప్రాంతాల్లో 37,600 కిలోల బియ్యం, 2024 సెప్టెంబర్ 20న గుర్ల మండలంలోని శేరీ పేట నుంచి గరివిడి మీదుగా తరలిస్తున్న 6,742 కిలోల బియ్యంను విజిలెన్స్ అధికారులు పట్టుకుని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.



2024 ఆగస్టు 9న చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం(ఫైల్)

కిలో రూ.20 వరకు కొనుగోలు....

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 178 చౌకదుకాణాలు, 78,083 రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్‌కార్డుల్లో ఒక్కో లబ్ధిదారునికి 5కిలోల చొప్పున ప్రతి నెలా చౌక దుకాణాల ద్వారా బియ్యం సరఫరా జరుగుతోంది. ఆ బియ్యం ఇచ్చిన వెంటనే దళారులు రంగంలోకి దిగి తిరిగి కిలో రూ.16 నుంచి రూ.20 వరకు చెల్లించి లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసిన బియ్యాన్ని తిరిగి రైస్‌మిల్లులకు, పెద్ద వ్యాపారులకు అధిక లాభాలకు విక్రయించుకుంటున్నారు.

కేసులు నమోదు చేస్తాం....

రేషన్ బియ్యం బయట మార్కెట్‌లో విక్రయించిన వారిపై 6 ఏ కేసులు నమోదు చేస్తున్నాం. అంతేకాకుండా రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసినా సరే కేసులు నమోదు తప్పదు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నాం.

– పిన్నింటి రామారావు, సీఎస్‌డీటీ, చీపురుపల్లి

అందని వంట నూనె..!



పెదమేమలి అంగన్‌వాడీ కేంద్రం

- సెప్టెంబర్‌కు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కాని వంట నూనె
- గంట్యాడ ప్రాజెక్టు పరిధిలో 166 కేంద్రాలు
- 50 కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు నేటికీ అందని నూనె

గంట్యాడ: పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఎన్‌డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధి కనబరచడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందించాల్సిన సౌకర్యాలు, సరుకులను అందించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ నెల ఏదో ఒక వస్తువు సరఫరాలో జాప్యం చేస్తుండడంతో లబ్ధిదారులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి. సెప్టెంబర్ నెలకు సంబంధించి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన వంట నూనెను ఇంత వరకు అందించలేదు. కొన్ని కేంద్రాలకు మాత్రమే సరఫరా చేసి మిగతా కేంద్రాలను విస్మరించారు.

గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో...

గంట్యాడ ప్రాజెక్టు పరిధిలో 166 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గంట్యాడ మండలంలో 96, బొండపల్లి మండలంలో 70 కేంద్రాలు ఉన్నా యి. వీటి పరిధిలో 514 మంది గర్భిణులు, 455 మంది బాలింతలు, 3,483 మంది పిల్లలు ఉన్నారు. వీరికి రోజూ పప్పు లేదా కూరగాయలతో కూడిన భోజనం, 100 మిల్లీలీటర్ల పాలు ఇస్తారు. గర్భిణులు, బాలింతలకు బెల్లం, వేరుశనగ చెక్కీలు, రాగి పిండి, అటుకులు, కర్జూరంతో పాటు, ఐదు లీటర్ల పాలు, కిలో కందిపప్పు, అర లీటర్ వంట నూనెను ప్రతీ నెల ఇంటికి అందిస్తారు. గంట్యాడ ప్రాజెక్టు పరిధిలోని 969 గర్భిణులు,బాలింతలకు ఒకొక్క రికీ నెలకు అరలీటరు చొప్పున పంపిణీ చేసేందుకు 484.50 లీటర్ల నూనె అవసరం. అయితే గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 116 కేంద్రాల కు మాత్రమే సెప్టెంబర్ నెలకు సంబంధించి వంట నూనె సరఫరా చేశారు. 50 కేంద్రాలకు ఇంక సరఫరా చేయలేదు. మరో వారం రోజుల్లో సెప్టెంబ ర్ నెల పూర్తి కానుంది. ఇప్పటి వరకు నూనె సరఫరా చేయకపోవడంతో ఈనెలకు సంబంధించి వంట నూనె ఇక ఇవ్వరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే నూనె ప్యాకెట్లు

వస్తే పంపిణీ చేస్తాం

గంట్యాడ ప్రాజెక్ట్ పరిధిలో 50 కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఈనెలకు సంబంధించి వంట నూనె ఇంకా సరఫరా కాలేదు. స్టాక్ వచ్చిన తర్వాత పంపిణీ చేస్తాం.

– దోకుల ఉమాభారతి, ఐసీడీఎస్ పీఓ , గంట్యాడ ప్రాజెక్టు

జిల్లాస్థాయి పోటీలకు సోంపురం విద్యార్థులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ గోవిందరావు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తాచాటి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు ఆది వారం తెలిపారు.అండర్–14 బాలుర విభాగం యోగాలో వై.రోహిత్, డి.చైతన్య, వి.వివేక్, ఆర్.ఎర్రినాయుడు, ఖోఖోలో సీహెచ్.చక్రీ, కె.నవీన్, కబడ్డీలో హెచ్.ఫణిభూషన్, ఎస్.అజయ్, 200 మీటర్ల పరుగు పోటీల్లో హెచ్ ఫణీంద్ర, కె.నవీన్, వందమీటర్ల పరుగు పోటీల్లో ఎస్.గుణశేఖర్ మండల స్థాయిలో రాణించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికల విభాగం యోగాలో డి.కీర్తన, కబడ్డీలో ఏ.మేఘన, ఖోఖోలో జె.లక్ష్మి, వి.హారిక ఎంపికయ్యారు. విద్యార్థులను, పీడీ గోవిందరావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్వర్టు నిర్మించరూ...



కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

వేపాడ: మండలంలో శింగరాయి నుంచి చందులూరు వెళ్లే మార్గంలో తమ్మయ్య చెరువు వద్ద కల్వర్టు నిర్మించాలని శింగరాయి గ్రామస్తులు కోరుతున్నారు. ఏదైనా పని నిమిత్త గ్రామం నుంచి చందులూరు మీదుగా కొత్తవలస, విజయనగరం, విశాఖపట్నం వెళ్లేటప్పుడు వర్షాకాలంలో తమ్మయ్య చెరువు నిండి అలుగు పారేటప్పుడు రోడ్డుపై నుంచే నీరు ప్రవహిస్తుంటోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ సమయంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మిస్తే తమ సమస్య పరిష్కారమవుతుందని, అధికారులు ఆ దిశగా ఆలోచన చేయాలని గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు.

ఘనంగా పసలమ్మతల్లి పండగ



జామి: ఆర్.బి.పురంలో అమ్మవారి గుడి వద్ద పూజలు చేస్తున్న రైతులు



వేపాడ: బక్కునాయుడుపేటలో అమ్మవారి గద్దె వద్దకు వెళుతున్న భక్తులు



లక్కవరపుకోట: చందులూరులో పశువులను అమ్మవారి గుడివద్దకు తీసుకొచ్చిన రైతులు



వేపాడ: బక్కునాయుడుపేటలో అమ్మవారి గద్దె వద్దకు పశువులను తీసుకువచ్చిన రైతులు

లక్కవరపుకోట/జామి/వేపాడ: ఎల్.కోట మండలంలోని చందులూరు,కిత్తన్నపేట,పోతంపేట,ఆర్.జి.పేట, కొత్తపాలెం తదితర గ్రామాల్లో, జామి మండలంలోని ఆర్.బి.పురం, వేపాడ మండ లంలోని వేపాడ, వల్లంపూడి, వీలుపర్తి, బక్కునాయుడుపేట గ్రామాల్లో పసలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పంటలు బాగా పండాలని, పశువులు ఆరోగ్యంగా ఉండాలని ఏటా ఖరీఫ్ వరి నాట్లు పూర్తయిన తర్వాత రైతులు ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా పండగ నిర్వహించారు. రైతులు తమ పశువులను అమ్మవారి గుడి వద్దకు తీసుకొచ్చి అమ్మవారికి పూజలు చేసిన అనంతరం పశువులకు పూజలు చేశారు.

నేత్రదానం మహాదానం

విజయనగరం ఫోర్ట్: నేత్రదానం మహాదానమని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. గరివిడి మండలం సరిపేట గ్రామానికి చెందిన తెలుగు సూరమ్మ అనే వృద్ధురాలు మూడు రోజుల కిందట అనారోగ్యంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరి ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆప్తాలమిక్ ఆఫీసర్లు జి. వెంకటేశ్వరావు, బి. తారకేశ్వరావు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు నేత్రదానానికి అంగీకరించారు. దీంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డోనేషన్ సెంటర్ టెక్నీషియన్, సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ బోళం పద్మావతి ఆధ్వర్యంలో మృతురాలి కార్నియాను సేకించారు. నేత్రదానానికి అంగీకరించిన మృతురాలి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా సూపరింటిండెంట్ అభినందించారు.



కార్నియా సేకరిస్తున్న టెక్నీషియన్ రమణ

సుపథ కృషి అభినందనీయం



సుపథ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎల్.కోట గురుకుల పాఠశాల విద్యార్థినులు

లక్కవరపుకోట: మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువల పరిరక్షణకు సుపథ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. స్థానిక సుపథ స్వచ్ఛంద సేవా సంఘం వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులుగా నిర్వహించిన సుపథ ప్రతిభ పరీక్షలకు విశేష స్పందన లభించింది. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న చిన్నారులకు పద్య పఠనం, శ్లోకపఠనం, గేయాలు, వ్యాసరచన, ప్రహేళిక, వేదపఠనం, వర్ణమాల, గుణింతాలు, ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు, తెలుగు అంకెలు, తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించారు. కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, ఎల్.కోట మండలాల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం బహుమతులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక జీవితం అంటూ మన సంస్కృతి, సంప్రదాయాలు, మాతృభాష నిర్వీర్యమవుతున్న ప్రస్తుత రోజుల్లో వాటి పరిరక్షణకు సుపథ చేస్తున్న కృషికి అంతా సహకారం అందించాలన్నారు. సంస్థ కార్యకలాపాల్లో తనని భాగస్వామ్యం చేయాలని కోరారు. సుపథ సంస్థ వ్యవస్థాపకులు యు.వి.ఏ.ఎస్.రాజు,ఎంఈఓ సీహెచ్.కూర్మారావు, నిర్వాహకులు హే.శ్రీహరిశర్మ, జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, పలువురు ఉపాధ్యాయాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

వైభవంగా వినాయక నిమజ్జనోత్సవాలు



వేపాడలో గణనాథున్ని ఊరేగిస్తున్న గ్రామపెద్దలు



వేపాడలో డ్యాన్స్ చేస్తున్న యువత

వేపాడ: మండల కేంద్రంతో పాటు, కృష్ణారాయుడు పేట గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. వేపాడలో గ్రామ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు 15రోజుల పాటు పూజలందుకున్నాడు. శనివారం రాత్రి 10 గంటలకు వేపాడ, వల్లంపూడి జంట గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు ప్రారంభమైంది. ఆదివారం వేకువ జామున గణనాథుడిని కోనేరు వద్దకు చేర్చి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటంతో పాటు స్థానిక యువత చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కృష్ణారాయుడుపేటలో వినాయకుడి ఊరేగింపులో యువత సందడి చేశారు.

ఇలా అయితే రాకపోకలు సాగించేదెలా..?

- వర్షాలకు సాగునీటి కాలువలు,చెరువులను తలపిస్తున్న ఆర్ఓబీలు



సాగునీటి కాలువను తలపించేలా రంగరాయపురం ఆర్ఓబీ వద్ద వరద నీరు(ఫైల్)



కొత్తవలస సంతమార్కెట్ సమీపంలోని ఆర్ఓబీ వద్ద నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు(ఫైల్)

కొత్తవలస: కొత్తవలసతో పాటు ఎల్.కోట మండలాల పరిధిలో రైల్వే గేటుల స్థానంలో రైల్వే అధికారులు నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిల(ఆర్ఓబీ) వల్ల వర్షాకాలంలో వాహన చోదకులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అండర్ బ్రిడ్జిల వద్ద వరద నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోయి, చెరువులు, పంట కాలువలను తలపిస్తున్నాయి. రైల్వే ఇంజినీరింగ్ అధికారులు కనీస ఆలోచన లేకుండా వీటిని నిర్మించారా అని ప్రజలు అనుకుంటున్నారు. కొత్తవలస- కిరండోల్ రైల్వే లైన్‌లో నిమ్మలపాలెం, రంగారాయపురం,సోంపురం, దాంపురం తదితర ప్రాంతాల్లో, అలాగే హౌరా మెయిన్ లైన్‌లో దేశపాత్రునిపాలెం, మంగళపాళెం, కొత్తవలస, సుంకరపాలెం, కంటకాపల్లి తదితర ప్రాంతాల్లో ఆర్ఓబీలను నిర్మించారు. భారీ వర్షం కురిస్తే ఈ మార్గాల్లో రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్.కోట మండ లంలోని సోంపురం గ్రామ సమీపంలో ఆర్ఓబీ వద్ద నీరు నిలిచి పోవడంతో వేపాడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఇంజిన్‌ల సహాయంతో వరద నీటిని బయటకు తోడించడంతో ఆ మార్గంలో రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి. అన్ని ఆర్ఓబీల వద్ద వర్షాకాలంలో ఇదే సమస్య తలెత్తుతోందని, రైల్వే అధికారులు స్పందించి వరదనీరు బయటకు పోయే మార్గాలను చూపాలని ఆయా మార్గాల్లో ప్రయాణించే ప్రజలు కోరుతున్నారు.